# భావన - ప్రవర్తన

ఆనందరావు, నేను ఒకేమంచంమీద పడుకున్న సందర్భాలు కొన్నివున్నాయి. కాని ఒకే కంచంలో భోంచేయ్యాల్సిన గతి ఈనాటి వరకు మాకుపట్టలేదు!

అయినప్పటికి మాస్నేహాన్ని ఏమంత తక్కువగా అంచనా వెయ్యడానికి వీల్లేదు.

ఉద్యోగరీత్యా మామధ్య గతమూడేళ్ళనుండీవున్న దూరం, ఈమధ్య వాడికి "బొబ్బిలి" బదిలీ అయిన కారణంగా దగ్గర పడింది.

...."నిన్నుచూసి సుమారు మూడేళ్ళు కావస్తోంది. నిన్ను చూడాలని నాకుంది. అంచేత యీవచ్చే శనివారం సాయంత్రం అక్కడ బయలుదేరి నువ్వు తప్పకుండా మాయింటికి రావాలి. ఇల్లు మారలేదు! .. నీకు తెలుసుకదూ?.... నీరాక కోసం ఎంతో ఆత్రంగా నిరీక్షించే,

నీ ప్రియమిత్రుడు,

మూర్తి.

అని వాడికి ఉత్తరం వ్రాసేను. వస్తానని సమాధానం వ్రాసేడు. కాని రాలేదు. మరోరెండు శనివారాలు వాడొస్తాడేమోనని చూసేను. కాని వాడు రాలేదు

నాకు చాలా కోపమొచ్చింది!.... తానెందుకు రాలేకపోయేడో ఆవిషయమైనా ఓవుత్తరం వ్రాయొచ్చుగా?.... అంత తీరుబడి లేకుండావున్నాడా?....వళ్ళుమండిందినాకు!

ఆవాళ శనివారం. వేగంగా ఆఫీసుపని ముగించుకొని, సాయంత్రం ట్రైనులో బయలుదేరేను. ట్రైను "బొబ్బిలి" చేరేసరికి రాత్రి తొమ్మిదిగంటలయింది. అగ్రహారం వీధిలో వాడిల్లు ఎక్కడుందో తెలుసుకొనేసరికి ఓగంటపైచిలుకుపట్టింది నాకు !....

ఆనందరావు భార్య నన్నుచూసి సంభ్రమాశ్చర్యాలతో, "అరె!....ఇవాళ సాయంత్రం అర్.టి సి. బస్సులో అతను మీకోసం విశాఖపట్నం వెళ్లేరు!" అనంది.

ఇహ ఏంచెయ్యడమో నాకు పాలుపోలేదు !

"కలకత్తాలోవున్న మా అడపడచుకి వంట్లో బాగులేదని వైరొస్తే, సెలవుపెట్టి వెంటనేకలకత్తావెళ్ళేరు. మొన్ననేవచ్చేరు. అని చెప్పిందామె.

"మరిప్పుడు నేను వెంటనే వైజాగ్‌వెళ్ళడానికి...."

"ట్రైనుగాని, బస్సుగాని ఏదీలేదు!" అనందామె.

"మరయితే........"

"తెల్లారితేనేగాని వైజాగ్ వెళ్లడానికి మీకేప్రయాణ సాధనం దొరకదు, అందేత నిశ్చింతగా ఈరాత్రి మాయింట్లో పడుకోండి."

"ఏదైనా లాడ్జీలో పడుకొని, మార్నింగ్ ఫస్టుబస్సులో బయలుదేరి వైజాగ్ వెళతాను."

"ఈరాత్రి మాయింట్లో పడుకోడానికి మీరెందుకు సంశయిస్తున్నారో నాకు తెలుసు!" అందామె అదోలాగ నవ్వుతూ!

ఆ శేషరాత్రి ఆయింట్లో పడుకోవ్కనేటందుకు నేనెందుకు సంశయిస్తున్నది, ఊహించలేనంతటి అమాయకురాలామె కాదన్న సంగతి నాకుతెలుసు !

అప్పుడాయింట్లో ఆమెతప్ప మరెవ్వరూలేరు. అదిరాత్రి వేళ!....పైగా ఒక్క గదివున్న యిల్లది!....అపరిస్థితిలో నేను ఆరాత్రి అయింట్లోవుండడం మంచిపనికాదనుకున్నాను.

ఏదో మర్యాదకోసం ఉండమని ఆమె కోరుంటుందేకాని, మనస్పూర్తిగా కోరుండదని భావించేను ఏదో ఓసాకుచెప్పి తప్పించుకు పోవాలనే ఉద్దేశ్యంతో, "స్థలంమారితే నాకు సాధారణంగా నిద్రపట్టదు. అంచేత రైల్వేస్టేషనుక పోయి, ట్రైనొచ్చేటంత వరకు వెయిటింగ్‌రూములో ఎట్లాగోవోలా కాలక్షేపంచేసేస్తాను." అని అన్నాను

"ఆ కాలక్షేపమేదో యిక్కడే చెయ్యొచ్చుగా!" అందామె చిరునవ్వొలకబోస్తూ.

"ఊహుం!....మీకు చాలా యిబ్బంది!"

"అతను ఇంటిదగ్గరలేని సమయంలో ఇక్కడుండడానికి మీకేవయినా యిబ్బందిగావుంటే ఉండొద్దేమోగాని నాకేవీ యిబ్బందిలేదు !" అని కొంచెంసేపు మౌనంగావూరుకొని, "మిమ్మల్ని మీరే నమ్మలేనిపక్షంలో ఇక్కడుండమని మిమ్మల్ని నేను ఇంతకంటే అధికంగా బలవంతంచెయ్యను!" అని ఆమె స్నిగ్ధ కంఠంతో అనేసరికి నేను విభ్రాంతబోయేను.

ఇహ ఎట్లా తప్పించుకుపోవడమో నాకర్ధంకాలేదు. కర్తవ్య విమూఢునిలా అచేతనంగా నిలబడివున్న నాకేసి జాలిగాచూస్తూ

"ఎంతసేపట్లా నిలబడతారు?.... అట్లా ఆ మంచంమీద కూర్చోండి!" అందామె.

నేను కూర్చున్నాక, "మీరు బహుశా విశాఖపట్నంలో సాయంత్రం నాలుగుగంటలకో, అయిదుగంటలకో బయలు దేరి ఉంటారు !....అవునా?" అనడిగిందామె.

"ఉఁ!" అని మూలిగేను.

"అయితే మీరింటి దగ్గరభోంచేసి బయలుదేరుండరు. అవునా?"

"అవును!.... కాని విజయనగరం స్టేషనులో మస్తుగా టిఫిన్ చేసేను. అంచేత నాకేఁవీ ఆకలిగాలేదు!"

మీకాకలిగావున్నా లేకపోయినా నేనిప్పుడేఁవీ మీకోసం ప్రత్యేకంగా చెయ్యాల్సిన అవసరం లేదు!.... ఇవాళ శనివారం కదా!.... అంచేత నాకొంటిపూట!.... అందుకని చపాతీలు చేసేను పీకమొయ్యా తినగా ఇంకా మిగిలిపోయే యికొన్ని అమిగిలి పోయినవాటినే మీకు పెడతాను. మొహమాట పడ కుండా తినండి." అంటూ వంటింట్లోకెళ్ళి, ఓ ప్లేటులో చపాతీలు పెట్టి, నంచుకోనేటందుకు వంకాయమెంతికూర వేసి— ఓ స్టూలుబల్లను నాముందుకులాగి, దానిపై ఆప్లేటునుంచి "తింటూండండి, మంచినీళ్ళు తెస్తాను." అంటూలోనకెళ్ళి, ఓ చిన్న మరచెంబుతో మంచినీళ్ళను తెచ్చి బల్లపైవుంచి, మళ్ళీ లోనకెళ్ళిందామె!

నేను, తినడం పూర్తియేసరికి, ఓగ్లాసుతో హార్లిక్స్‌ను తెచ్చి నాముందున్న స్టూలు బల్లపైవుంచింది!....

"ఇప్పుడు హార్లిక్సు ఎందుకు[illegible]చేసేరు?" అనడిగేను ఆమె ముఖంలోకి పశ్నార్ధకంగా చూస్తూ.

"తాగడానికి!" అని కొంటెగా సమాధానమిచ్చిందామె.

"నాకు తాగాలని లేదు!" అన్నాను.

"అయితే పారబోసెయ్యండి!" అని ఆమె అనేసరికి, మారు మాటాడకుండా బుద్ధిగా తాగేశాను.

ఆమె నావేపు సంతృప్తికరంగా ఓమారుచూసి, "మీరు ఆమంచంమీద పడుకోండి!" అనంది.

"ఈగదిలోనా ?.... మరి మీరెక్కడ పడుక్కుంటారు ? ఉన్నది ఇదొక్కటే గదనుకుంటాను!.... అంచేత నేను వీధి గుమ్మంలో పడుక్కుంటాను. ఓ చాపా, తలగడా, దుప్పటీ యివ్వండి చాలు!"

"ఇది ఏకాలమో తెలుసా?.... చలికాలం!.... ఎముకల్ని కొరికేటంత అధికంగావుంది చలి!.... అవతల వీధిగుమ్మంలో పడుక్కుంటే కొరడు బారిపోతారు!"

"మరేం ఫరవాలేదు!" అని అన్నాను.

"మీరీగదిలోపల పడుక్కున్నా మరేం ఫరవాలేదు!" అని ఆమె అనేసరికి, నేనామె శీలాన్ని కాస్తా శంకించేను!....

నేనేక్షణాన్నయితే ఆమె శీలాన్ని శంకించేనో, అదేక్షణంలో నా శరీరంలోని నరాలన్నీ మధురమైన వాంఛతో ఉద్రిక్తమయినాయి!!....

ఆమె విశాలమైన నేత్రాలలోకి చూసేను, అవి కవ్వించే కళ్ళు!... ఆమె కళ్ళల్లో అనిర్వచనీయమైన ఆకర్షణశక్తివుంది!

సర్వాంగ సుందరమైన ఆ లావణ్యవతివేపు కొద్దిక్షణాలసేపు రెప్పవెయ్యకుండాచూసి, పరవశుడనయేను విట్లాగో తేరుకొని, "మరి నేనీగదిలో పడుక్కుంటే మీరెక్కడ పడుక్కుంటూరు?" అనడిగేను; అనుమాన నివృత్తికోసం!

"ఈ గదిలోనే పడుక్కుంటాను!" అని ఆమె ఏమీ సంశయిం చకుండా సమాధానమిచ్చేసరికి; నాపొందుగోరే సంకల్పం ఆమెకున్నట్లు నేను రూఢి చేసుకున్నాను.

నిజానికి పరస్త్రీ సాంగత్యాభిలాషలేని సదాచారిని కాదు నేను!.... నాకీ అభిలాష చాలాకాలంనుండీవుంది. కాని అట్టే ధైర్యం లేనివాడినయినందువల్ల, నాయీ అభిలాషను అతి బల వంతంగా ఇంతకాలమయి అణచి వేసుకుంటున్నాను!

నా యీ అభిలాషను తీర్చుకోనేటందుకు ఇంతకంటే చక్కని అవకాశం నా యీ జీవితంలో మరెన్నడూరాదను కున్నాను!.... వచ్చిన ఈ అవకాశాన్ని ఎంతమాత్రం జార విడుచుకోకూడదనే స్థితికి దిగజారిపోయేను!.... నాలో ఏ విధంగా పరస్త్రీ వాంఛవుందో, అదే విధంగా ఆమెలోనూ పర పురుషవాంఛ ఉంటుందనుకున్నాను!

నాశరీరంలోని నరాలన్నీ కామోద్రేకంతో ఉద్రిక్తమయేయి! నైతికంగా నేనెంత అధమస్థితికి దిగజారిపోతున్నది ఆలోచించి తెలుసుకోగలిగే విచక్షణాజ్ఞానం, నాకాసమయంలో లోపిం చింది!....

కొంతసేపు మంచంమీద యిటూ అటూదొర్లి; అగదిలో ఓ మూల చాపపై పడుకున్న అమె ముఖంకేసిచూస్తూ, "నాకిక నిద్రపట్టేటట్లు లేదు!" అని అన్నాను. నాకు నిద్ర పట్టక పోడానికిగల హేతువును అమె గ్రహించగలదనే అభిప్రాయం తోనే అట్లా అన్నాను.

"ప్చ్!.... పాపం!.... మిమ్మల్ని చూస్తూంటే నాకెంతో జాలేస్తూంది!.... ప్రస్తుతం మాయింట్లో మీరేరకంగా యాతన పడుతున్నారో, ఇదే రకంగా మావారిప్పుడు మీయింటిదగ్గర యాతనపడుతున్నారు కాబోలు!!" అని అమె నిర్వికారంగా అనేసరికి, తీవ్రమైన విద్యుద్ఘాతానికి లోనయినట్లు కొంతసేపు చైతన్యరహితుడనయేను.

ఏవేవో అనుమానాలు నాహృదయాన్ని కెలికివేయు సాగేయి!....

నాభార్య....

ఎటువంటిది?.... దాని మనస్సులో ఎటువంటి వాంఛలు అణగిమణిగున్నాయి ?.... పరపురుషవాంఛ దానికి లేదను కోడానికి ఆధారమేమిటి?....

ఇకపోతే తనమిత్రుడైన ఆనందరావుకి పరస్త్రీవాంఛ లేదను కోడానికి ఆధారమేమిటి?.... ఇంతకీ ఆనందరావు మరీ అంత విచక్షణాజ్ఞానంలెకుండా ప్రవర్తిస్తాడా?....

ఏమో!....

మరి వాడిదీ నాలాంటి మనస్తత్వమే అయినట్లయితే?

ఇక ఆ విషయమై ఊహించడానికి నాకర్థం మనస్కరించలేదు! ఆ సమయంలో ఇంచుమించుగా నాకు మతిపోయిందనే చెప్పాలి!

గబుక్కున మంచంమీదనుంచి లేచి, "ట్రైనుకు టైమయిపోతున్నాది. ఇక నేనెళతాను!" అనంటూ ఎంతో గాభరాగా నేను బయలుదేరడానికుద్యుక్తుడనయేసరికి, ఆమె నివ్వెరపోయింది!

నావేపు వింతగాచూస్తూ, "మీకేం మతిపోయిందేమిటి? వైజాగెళ్ళడానికి యిప్పుడే ట్రయినుంది?... ఇంకా రాత్రిఒంటి గంటయినాకాలేదు. తెల్లారితేనేగాని వాల్తేరు పాసింజరురాదు! ఇంతకీ ఆదిక్కుమాలిన ట్రైను ఎప్పుడూ లేటే!" అందామె.

"స్టేషను మాస్టర్ని నేనెరుగుదును. ఏదైనా గూడ్సుబండి దొరికితే, గార్డుని రిక్వెష్టుచేసి, అందులో వెళ్ళిపోడానికిప్రయత్నిస్తాను!" అంటూ తలుపు తెరచి గబగబా వెళ్ళిపోయేను.

నేనెందుకంత అకస్మాత్తుగా వెళ్ళిపోయేనో, ఆమె సవ్యంగా అవగతం చేసుకోగలదనే నమ్మకం నాకంతగా లేదు!

* * * *

ఎంతవుండమని బలవంతంచేసినా ఉండకుండా, ఆ రాత్రి నామిత్రుడు ఆనందరావు వెళ్ళిపోయేడని, నేనింటి కెళ్ళేక నా భార్య నాతో చెప్పింది!....

నేనెటువంటి అనుభూతిని పొందేనో, అటువంటి అనుభూతినే ఆనందరావు కూడా పొందుంటాడని ఊహించేను!

ఇట్లాకాక మరోరకంగా ఊహించేటందుకవకాశం లేక పోలేదు!!....

అయినా మరోరకంగా ఊహించేటందుకు నాకు మనస్కరించలేదు!....

[సరిగ్గా గుర్తులేదు. పదిపదిహేనేళ్ళక్రితమెప్పుడో సంపాదకుని కోరికపై వ్రాసిన కథానికయిది!.... "అంజలి" ప్రారంభ సంచికలో ఈకథానికను ప్రచురించేరు.]

